మౌలిక వసతుల కల్పనకు కృషి



అసోసియేషన్ ప్రతినిధులను సన్మానించిన కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్ తదితరులు

శేరిలింగంపల్లి: రాజీవ్ స్వగృహ ఆరంభ్ టౌన్‌షిప్‌లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ తెలిపారు. ఆరంభ్ టౌన్‌షిప్ అసోసియేషన్ నూతన ప్రతినిధులు ఆదివారం జీహెచ్‌ఎంసీ వార్డు ఆఫీస్‌లో కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్‌ను కలిశారు. కమిటీ ప్రతినిధులను శాలువాతో సన్మానించారు. ఆరంభ్ టౌన్‌షిప్ ప్రెసిడెంట్ లక్ష్మయ్య, ఉపాధ్యక్షులు సత్యనారాయణ రెడ్డి, ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్, సంయుక్త కార్యదర్శి సుధా, కోశాధికారి రాజేంద్ర ప్రసాద్, సంయుక్త కోశాధికారి రాజీవ్‌కుమార్, ప్రతినిధులు కాంచన కృష్ణ, కాంగ్రెస్ నాయకులు గోపాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

రాయదుర్గం: సగరులకు ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తామని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే గాంధీ హామీ ఇచ్చారు. సగర సంఘం అధ్యక్షుడు ఉప్పరి శేఖర్, రాయదుర్గం అధ్యక్షుడు బాలరాజ్‌ల పర్యవేక్షణలో రాయదుర్గం సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన కేలండర్‌ను ఆయన ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రవీందర్, యాదగిరి, రాము, కురుమూర్తి, మన్యం, రాజు, శ్రీనివాస్ ,గాయత్రి, బాలకృష్ణ పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు



మియాపూర్: మన సంస్కృతి, సంప్రదాయాలకు పండగలు ప్రతీకలని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ అన్నారు. ఎంఏనగర్ కాలనీలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ , కొమిరిశెట్టి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు.విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు.

సీపీఎం విరాళాల సేకరణ

రామచంద్రాపురం (పటాన్‌చెరు): ప్రజా సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కే.రాజయ్య అన్నారు. సీపీఎం రాష్ట్ర 4వ మహాసభల సందర్భంగా ఆదివారం ఎల్ఐజీ కాలనీలో విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామచంద్రాపురం పట్టణంలోని ఈఎస్ఐ ఆసుపత్రిని కార్పొరేట్ ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలని కోరారు. ఇస్నాపూర్, బొల్లారం, బొంతపల్లిలలో ఈఎస్ఐ ఆసుపత్రిలను ఏర్పాటు చేసి కార్మికులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కోరారు. ఇస్నాపూర్, బొల్లారం, బొంతపల్లి, కాజీపల్లి, గడ్డపోతారంలోని ప్రజలు కాలుష్యంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, ఏడుకొండలు, సోమయ్య, శంకర్, యేసురత్నం పాల్గొన్నారు.

నేడు ముగ్గుల పోటీలు

రాజేంద్రనగర్: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని రాజేంద్రనగర్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో ఈనెల 13న ఉదయం 10 గంటలకు రాజేంద్రనగర్ డివిజన్ మహిళా మోర్చా ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు డివిజన్ ప్రధాన కార్యదర్శులు కవిత, స్వప్నారెడ్డి తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చిన్న పిల్లల డాక్టర్ అమరేందర్, అత్తాపూర్ కార్పొరేటర్ మొంద్ర సంగీత హాజరవుతారన్నారు.

వార్డు కార్యాలయ అభివృద్ధికి కృషి

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలోని గ్రామ పంచాయతీ భవనాన్ని నూతన వార్డు కార్యాలయంగా అభివృద్ధి చేస్తున్నామని, ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని 17వ వార్డు కౌన్సిలర్ ఉషారాణి అన్నారు. ఆదివారం ఆమె వార్డు కార్యాలయ స్లాబ్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపాలిటీ కేంద్రంలోని వార్డులకు కార్యాలయాలు లేక ఇబ్బందిగా పడుతున్నారన్నారు. పాత కార్యాలయంలో ఉన్న పోలింగ్ బ్యాలెట్ బాక్సులను తీయించి దానిని అభివృద్ధి చేస్తున్నామన్నారు. మరో మూడు నెలల్లో పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు.

వంతెనలు ఉన్నా ఉపయోగం లేదు..

అవసరమైన చోట లేక.. రోడ్డు దాటుతున్నారు

- పాదచారులు రోడ్డు దాటే క్రమంలో ప్రమాదాలు
- ఎఫ్ఓబీల వద్ద 3 నెలలుగా పనిచేయని లిఫ్టులు, ఎస్కలేటర్లు
- నిర్వహణలోపం, పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న వృద్ధులు, మహిళలు



మదీనాగూడలోని దీప్తిశ్రీనగర్ వద్ద ఫుట్‌ఓవర్ బ్రిడ్జి





పనిచేయని లిఫ్టులు, ఎస్కలేటర్లు

మియాపూర్: ప్రజలు సులువుగా రోడ్డు దాటడానికి ఏర్పాటు చేసిన ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు (పాదచారుల వంతెన) అలంకారప్రాయంగా మారాయి. దీంతో ప్రధానరోడ్డు దాటే క్రమంలో పాదచారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఎఫ్ఓబీల నిర్వహణను పట్టించుకోకపోవడంతో లిఫ్టులు, ఎస్కలేటర్లు పనిచేయక మహిళలు, వృద్ధులు మెట్లు ఎక్కలేక రోడ్డు దాటుతున్నారు. దీంతో నిత్యం మియాపూర్

◆ మదీనాగూడ జాతీయ రహదారిపై ఎక్కడో ఓచోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. అదేవిధంగా మియాపూర్- మదీనాగూడ జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు ప్రజలకు అవసరమైనచోట లేకపోవడంతో పాదచారులు రోడ్డు దాటి అవతలికి వెళుతున్నారు. ట్రాఫిక్ రద్దీ ఉన్నచోట ప్రజలు ఎక్కువగా సంచరించే ప్రాంతాల వద్ద ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు ఏర్పాటు చేయాల్సి ఉండగా అవసరం లేనిచోట ఏర్పాటు చేయడం, బస్టాప్‌లకు దూరంగా ఉండడంతో ప్రజలు వీటిని ఉపయోగించడం లేదు.

◆ మియాపూర్ జాతీయ రహదారి వద్ద రోడ్డు దాటాలంటే గగనమే. ఈ పరిస్థితిలో పాదచారుల కోసం గత 4 నాలుగు సంవత్సరాల క్రితం మియాపూర్ బొల్లారం, ఆల్విన్ ఎక్స్‌రోడ్డు వద్ద ఎఫ్ఓబీలు ఏర్పాటు చేశారు. అదేవిధంగా రెండేళ్ల కిందట మదీనాగూడలోని దీప్తిశ్రీనగర్, గంగారం సమీపంలోని జాతీయ రహదారిపై ఫుట్‌ఓవర్ బ్రిడ్జీలు ఏర్పాటు చేశారు.

◆ నిర్వహణలోపం కారణంగా దీప్తిశ్రీనగర్, గంగారం సమీపంలోని బ్రిడ్జిల వద్ద లిఫ్టులు, ఎస్కలేటర్లు మూడు నెలలుగా పనిచేయడం లేదు. దీంతో మహిళలు, వృద్ధులు మెట్లు ఎక్కలేకపోతున్నారు. దీంతో రోడ్డు దాటడం అవసరంగా మారింది.

◆ బొల్లారం క్రాస్‌రోడ్డు, ఆల్విన్ క్రాస్ రోడ్డు సిగ్నళ్ల వద్ద ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు ఏర్పాటు చేశారు. అయితే సిగ్నల్ వద్ద సమయంలో పాదచారులు రోడ్డు దాటుతున్నారు. సిగ్నల్స్ వద్ద ఎఫ్ఓబీలు ఏర్పాటు చేయడంతో ఉపయోగం లేకుండా పోయింది.

◆ మియాపూర్ న్యూ కాలనీ, మంగళవారం మార్కెట్ సమీపంలో, మియాపూర్ బస్టాప్, ఆల్విన్ క్రాస్ రోడ్డు వద్ద బస్టాప్ సమీపంలో ఏర్పాటు చేసి ఉంటే ఉపయోగంగా ఉండేదని ప్రజలు వాపోతున్నారు.

◆ రద్దీ ప్రాంతాల్లో షాపింగ్ మాల్స్ ఉండడం వల్ల అక్కడ ఎక్కువగా జనం రోడ్డు దాటుతూ ఉంటారు. అయితే అక్కడ నుండి ఫుట్‌ఓవర్ బ్రిడ్జీలు సుమారు 200-300 మీటర్ల దూరంలో ఉన్నాయి. దీంతో అక్కడి వరకు నడిచి వెళ్లి బ్రిడ్జి ఎక్కలేక జనం ఎక్కడపడితే అక్కడ రోడ్డు దాటుతున్నారు.

పట్టించుకోని అధికారులు

జాతీయ రహదారిపై దీప్తిశ్రీనగర్, గంగారం సమీపంలో ఉన్న ఫుట్‌ఓవర్ బ్రిడ్జిల లిఫ్టులు, ఎస్కలేటర్లు 3 నెలలుగా పని చేయడం లేదు. ఈ నిర్మాణాలు పూర్తై రెండేళ్లు అవుతోంది. అప్పటి నుంచి లిఫ్టులు, ఎస్కలేటర్లు పనిచేసిన దాఖలాలు లేవు. పాదచారుల వంతెనలు నిర్మించిన కాంట్రాక్టర్లు వీటిని పర్యవేక్షించాల్సి ఉంది. కానీ పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారాయి. అయితే ఇప్పటి వరకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.అధికారులు పాదచారుల వంతెనల నిర్వహణ విషయంలో పట్టింపులేమితో వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

> **అలంకారప్రాయంగా మారాయి..**
>
> పాదచారుల వంతెనల వద్ద లిఫ్టులు, ఎస్కలేటర్లు పనిచేయకపోవడంతో మహిళలు, వృద్ధులు మెట్లు ఎక్కలేక రోడ్లు దాటుతున్నారు. ఈ క్రమంలో పలు ఇబ్బందులు, ప్రమాదాలు జరుగుతున్నాయి. ఫుట్‌ఓవర్ బ్రిడ్జిల నిర్వహణను పట్టించుకోకపోవడంతో అలంకారప్రాయంగా మారాయి. ఉన్నతాధికారులు దృష్టిసారించి లిఫ్టులు, ఎస్కలేటర్లుకు మరమ్మతులు చేసి అందుబాటులోకి తీసుకురావాలి.
>
> – శ్రీకాంత్‌రెడ్డి, దీప్తిశ్రీనగర్ కాలనీ

హెచ్‌సీయూ డిపో నుంచి ప్రత్యేక బస్సులు

రాయదుర్గం: సంక్రాంతి పండగకి హెచ్‌సీయూ ఆర్టీసీ డిపో ద్వారా ప్రత్యేక బస్సులు వేశామని డిపో మేనేజర్ మురళీధర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ఆదివారం ఒక్కరోజు 39 ప్రత్యేక సంక్రాంతి బస్సులను నడపినట్లు తెలిపారు. 25 ప్రత్యేక బస్సులను గచ్చిబౌలి కూడలి నుంచి జడ్చర్ల వరకు నడిపినట్లు చెప్పారు. అంతేకాకుండా లింగంపల్లి కూడలి నుంచి 14 బస్సులను నారాయణఖేడ్, పిట్లమ్ వరకు బస్సులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సురక్షిత ప్రయాణానికి ఆర్టీసీ బస్సులే మేలని తెలిపారు. గచ్చిబౌలి, లింగంపల్లిలోని కూడళ్లలో ప్రత్యేక బస్సుల రాకపోకలను ఆయన పరిశీలించారు. ఆయన వెంట హెచ్‌సీయూ డిపో సూపర్‌వైజర్లు ,అధికారులు పాల్గొన్నారు.

దైవభక్తి కలిగి ఉండాలి

ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: జాతరలు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని భానురులో నిర్వహించిన రేణుకా ఎల్లమ్మతల్లి జాతర, రుద్రారంలో నిర్వహించిన భ్రమరాంబ మల్లికార్జున స్వామి కల్యాణ మహోత్సవ కార్యక్రమాల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మానసిక ప్రశాంతతకు ప్రతి ఒక్కరు దైవభక్తిని పెంపొందించుకోవాలని కోరారు. గత దశాబ్దికాలంలో నియోజకవర్గ వ్యాప్తంగా సొంత నిధులతో రెండు వందలకు పైగా దేవాలయాలు నిర్మించానని తెలిపారు. కార్యక్రమాల్లో కార్పొరేటర్ పుష్ప, బీడీఎల్ సీఐ స్వామిగౌడ్, సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, కార్యకర్తలు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఫలహారం బండి ఊరేగింపు..

పటాన్‌చెరు టౌన్: పటాన్ చెరు మండలం భానూర్ గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రేణుక ఎల్లమ్మ జాతర నిర్వహించారు. పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్‌గౌడ్, నీలం మధు ముదిరాజ్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సతీష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫలహారం బండి ఊరేగింపును ప్రారంభించారు.

షేక్ ఖాసింకు తెలుగు వెలుగు నంది పురస్కారం



పురస్కారం అందుకుంటున్న షేక్ ఖాసిం

శేరిలింగపల్లి: గుల్‌మొహర్‌పార్కు కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు, విశ్రాంత ప్రిన్సిపాల్ షేక్ ఖాసిం తెలుగు వెలుగు నంది పురస్కారం అందుకున్నారు. స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలు-2025లో భాగంగా చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో తెలుగు వెలుగు సాహితీ వేదిక ద్వారా ఈ పురస్కారాన్ని ఆయనకు అందించారు. శేరిలింగంపల్లి, రంగారెడ్డిజిల్లాలో విద్యా, సేవా రంగంలో ఆయన చేసిన కృషికి అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా గుల్‌మొహర్ పార్కు కాలనీవాసులు, విద్యావేత్తలు, సన్నిహితులు అభినందించారు.

హెచ్‌సీయూ ఏబీవీపీ నూతన కార్యవర్గం



అధ్యక్షుడు అనిల్‌కుమార్



కార్యదర్శి ఆయుష్‌కుమార్

రాయదుర్గం: హెచ్‌సీయూలోని అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) నూతన కార్యవర్గంను ఎన్నుకున్నారు. ఏబీవీపీ హెచ్‌సీయూ శాఖ ఇద్దరు పరిశోధక విద్యార్థులను అధ్యక్ష ,కార్యదర్శులుగా నియమించారు. ఆదివారం ఏబీవీపీ జాతీయ సెంట్రల్ యూనివర్సిటీల విభాగం కన్వీనర్ బాలకృష్ణ వివరాలను తెలిపారు. హెచ్‌సీయూ ఏబీవీపీ నూతన అధ్యక్షుడుగా లింగ్విస్టిక్ విభాగం పరిశోధక విద్యార్థి డి అనిల్‌కుమార్, కార్యదర్శిగా హిస్టరీ విభాగం పరిశోధక విద్యార్థి ఆయుష్‌కుమార్‌సింగ్‌లను ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలను పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో పని చేస్తామన్నారు.

అరుదైన శస్త్ర చికిత్స..



కేర్ ఆస్పత్రిలో రోగితో డాక్టర్ కైలాష్‌మిర్చే

గచ్చిబౌలి: అరుదైన శస్త్ర చికిత్స ద్వారా ఓ యువకుడిని కాపాడారు కేర్ ఆస్పత్రి వైద్యులు. కరోటిడ్ ఆర్టరీ డిసెక్షన్ ద్వారా రోగికి స్వాంతన చేకూర్చారు. నగరానికి చెందిన ఓ యువకుడికి వ్యాయామ కార్యకలాపాల వల్ల తీవ్రమైన మెడ నొప్పి, వాంతులతో బాధపడటంతోపాటు ఎడమవైపు హెమిపరేసస్‌తో బాధపడేవాడు. తీవ్రమైన గుండె నొప్పితో ప్రాణాపాయ స్థితిలో హైటెక్‌సిటీలోని కేర్ ఆస్పత్రిలో చేరారు. ఆస్పత్రి సీనియర్ కన్సల్టెంట్ న్యూరాలజీ వైద్యుడు డాక్టర్ కైలాష్‌మిర్చే ఆధ్వర్యంలోని వైద్యబృందం థ్రోంబోలిసిస్ ప్రక్రియ ద్వారా అతన్ని కాపాడారు. రోగి ఆరోగ్య స్థితి నిలకడగా ఉంది. ఈ విధానం క్లిష్టతరమైనప్పటికీ అధునాతన సాంకేతికతతో అద్భుతమైన ఫలితాన్ని సాధించామని డాక్టర్లు తెలిపారు.

వివేకానందుని బాటలో నడవాలి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్



మదీనాగూడలో వివేకానందుడికి నివాళులు అర్పిస్తున్న రవికుమార్‌యాదవ్

చందానగర్: భారతీయ సంస్కృతిని ప్రపంచానికి పరిచయం చేసిన ఘనత వివేకానందుడికే దక్కుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్ పేర్కొన్నారు. హఫీజ్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు జితేందర్, డాక్టర్ వంశీ రెడ్డి, ఆకుల లక్ష్మణ్ ఆధ్వర్యంలో మదీనాగూడలో వివేకానందుని విగ్రహానికి పూలమాలలు వేశారు. నేటి యువత ఆయన బాటలో నడిస్తేనే నిజమైన నివాళి అని అన్నారు. నాయకులు నాగులుగౌడ్, కేశవరావు, బుచ్చిరెడ్డి, లక్ష్మణ్, కేశవరావు, సత్యనారాయణరాజు, మనోహర్‌గౌడ్, శ్రీనివాస్‌చారి, గణేష్, శ్రీనివాస్, మమత, రవి, జగన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పండుగలు సంస్కృతికి ప్రతీకలు

మణికొండ: పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానాలు, పర్యావరణం, ప్రకృతికి ప్రతీకగా నిలుస్తాయని, ఆనందోత్సవాలతో అందరం కలిసికట్టుగా జరుపుకోవాలని ఆర్‌ఎస్‌ఎస్ భాగ్యనగర్ విభాగ్ కార్యవాహ రఘునాథ్ అన్నారు. ఆదివారం మణికొండ మున్సిపాలిటీ, హుడాకాలనీ బతుకమ్మ పార్క్‌లో ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండగ నుంచి సూర్యుడు తన గమనాన్ని మార్చుకుని ఉత్తరం వైపు పయనించటంతో ఉత్తరాయణం ప్రారంభం అవుతుందన్నారు. పంటలు ఇంటికి చేరి రైతులు ఆనందోత్సాహాలతో సంక్రాంతి పండగను చేసుకుంటారన్నారు. సంక్రాంతి ముగ్గులు, గొబ్బెమ్మలు, కొత్త ధాన్యంతో చేసిన ప్రసాదాన్ని దేవునికి సమర్పిస్తారన్నారు. ఈ సంస్కృతిని భావి తరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సంఘచాలక్ కె. శ్రీరాంరెడ్డి, కౌన్సిలర్ ఎల్.వందన నగేష్, కోఆప్షన్ సభ్యురాలు లక్ష్మీ రాములు, బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు సి.బీరప్ప, నాయకులు ఇందిర, శివకుమార్, శివ తదితరులు పాల్గొన్నారు.

గోదాదేవికి ప్రత్యేక పూజలు



గోదాదేవికి అభిషేకం చేస్తున్న దృశ్యం

రాయదుర్గం: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతానికి అత్యంత చేరువలో ఉన్న నానక్‌రాంగూడ రంగ్‌బాగ్‌లోని రంగనాథస్వామి ఆలయంలో రెండు రోజుల ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. మొదటిరోజు ఆదివారం ఉదయం గోదాదేవి మాతకు అభిషేకం, అలంకారం చేశారు. భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. రెండవ రోజు సోమవారం గోదా రంగనాథుల కల్యాణోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

నేడు తిరు కల్యాణం

రాజేంద్రనగర్: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా హైదర్‌గూడ చైతన్య విల్లాస్ కాలనీలోని శ్రీ సీతారామస్వామి ఆలయంలోఈ నెల 13న ఉదయం 9 గంటలకు స్వామి వారి తిరు కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా పీజేఆర్ జయంతి

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి పాపిరెడ్డినగర్‌లో మాజీ సీఎల్పీ నాయకులు స్వర్గీయ పి.జనార్దన్‌రెడ్డి జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. పాపిరెడ్డినగర్‌లో పీజేఆర్ విగ్రహానికి శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగేందర్ యాదవ్ మాట్లాడుతూ పాపిరెడ్డినగర్ ఏర్పాటు ఆయన చొరవతోనే సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు బద్దం కొండల్‌రెడ్డి, వార్డు మెంబర్ శ్రీకళ, నాయకులు కె.రమేష్, గోపాల్ యాదవ్, బసవరాజ్, ఎస్‌పీ.రెడ్డి, కుమార్, కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

చందానగర్‌లో..

చందానగర్: గంగారంలో.. జనార్దన్‌రెడ్డి జయంతిని పురస్కరించుకుని ఎంబీసీ చైర్మన్ జైపాల్, శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జీ జగదీశ్వర్‌గౌడ్ ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు కవిరాజ్, సూర్య, శేఖర్‌రెడ్డి, మధు, సౌందర్యరాజన్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



గంగారంలో ..



జనార్దన్‌రెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్, కాలనీ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి

సంగీత సుమధుర 'హాసిని'

అనర్గళంగా శ్లోకాలు, పద్యాలాపన




హాసిని భట్టిప్రోలు

రాయదుర్గం: భారతీయ సంస్కృతి పట్ల మమకారం.. అమ్మమ్మ ప్రేరణ.. తల్లిదండ్రుల ప్రోత్సాహం.. కర్ణాటక సంగీతంలో దిట్ట .. ఎన్ఆర్ఐ హాసిని భట్టిప్రోలు. అనర్గళంగా పద్యాలు, శ్లోకాలు ఆలపిస్తోంది. అందరి ప్రశంసలు అందుకుంది. కాగా హాసిని చిన్నతనం నుంచే సంగీతం నేర్చుకుంది. 10వ తరగతిలోనే అరంగేట్రం చేసింది. శాన్‌డియాగో కాలిఫోర్నియాలో నివాసముండే తల్లి పద్మజ, తండ్రి డాక్టర్ పవన్ భట్టిప్రోలు, అమ్మమ్మ చక్కిలం రాజేశ్వరి దగ్గర 4వ ఏటనే సంగీతంలో ఓనమాలు నేర్చుకొంది. తర్వాత గురువులు డాక్టర్ సిఎం వెంకటాచలం, హెచ్‌ఎస్ భాస్కర్, ఆర్‌కే రామ్‌కుమార్, గాయకులు పార్థసారథి నేమాని ప్రోత్సాహంతో తన 15వ ఏట కర్ణాటక సంగీత ప్రదర్శన అరంగేట్రం అమెరికాలోనే చేయడం విశేషం. ఇటీవలే చెన్నయ్‌లో, గురువాయూర్ ఆలయం, హైదరాబాద్‌లో ప్రదర్శనలు ఇచ్చారు. ఈ సందర్భంగా హాసిని తల్లిదండ్రులు మాట్లాడుతూ సంగీతం ద్వారా మానసిక ఆరోగ్యం కలిగేలా తగిన పరిశోధన చేయాలన్నదే లక్ష్యమని చెప్పారు.

అవార్డులు.. పురస్కారాలు

- బమ్మెర పోతన రచించిన భాగవతం ప్రచారానికి అంబాసిడర్ హాసిని
- ట్రై-ఎం మ్యూజిక్ ఆనర్ సొసైటీ సభ్యురాలు, మాడ్రిగల్స్ ఆనర్స్ క్వైర్ ప్రోగ్రామ్ సభ్యురాలు
- లాజొల్లా కంట్రీ డే స్కూల్ నుంచి ప్రఖ్యాత కీత్ హెల్డ్‌మన్ మ్యూజిక్ అవార్డు పొందింది
- వరల్డ్ మ్యూజిక్‌లో మిస్ కారోలిన్ బెక్కర్‌గారి మార్గదర్శనం అందడం ఒక గౌరవంగా భావిస్తోంది.
- క్లీవ్‌ల్యాండ్ త్యాగరాజు ఆరాధన, సిలికాన్ ఆంధ్రా సంగీతోత్సవాలు, నాటా పురస్కారాలు
- బే ఏరియా తెలుగు అసోసియేషన్ పోటీలలో పలు అవార్డులు

కనువిందు .. కూచిపూడి నృత్య ప్రదర్శనలు





శిల్పారామంలో ఏర్పాటు చేసిన సంక్రాంతి సంబురాలలో భాగంగా ఆదివారం ఆంఫీ థియేటర్‌లో పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కందుల కూచిపూడి నాట్యాలయం గురువు రవి కూచిపూడి శిష్యబృందం మూషికవాహన, వినాయకకౌతం, జతిస్వరం, అన్నమాచార్య కీర్తన, రామదాసు కీర్తన, వినరో భాగ్యము, గరుడ గమన తదితర అంశాలను ప్రదర్శించారు. కళాకారులు అశ్విక, ప్రియాంక సిరి, ఐశ్వర్య, చైత్ర, సురభి, ఆద్య, కీర్తి, ఇసాన్వి, శ్రావ్య, అరుణ, నిధి, శాన్వి, రిగిష్మ, చారిత్రక, సహస్ర తదితరులు పాల్గొన్నారు. – మాదాపూర్